కథ

రాత్రి పదకొండు గంటలు కావస్తోంది.

నేషనల్ హైవే మీద నగరం వైపు దూసుకు పోతోంది సుజుకి సమురాయ్.

బాగా త్రాగిన మత్తులో వున్నాడు రఘురాం. ఎర్రబారిన కళ్లతో ముఖం జేవురించింది.

# నిను వీడని నీడను నేనే!

మేఘావృతమైన ఆకాశం... చిన్నగా ధ్వనిస్తున్న ఉరుములు... తళుక్కుమంటున్న మెరుపులు. నగర శివార్లలోకి ప్రవేశించాడు. పవర్ కట్ అయింది.

చిటపటమంటూ చినుకులు మొదలయ్యాయి. ఆకస్మికంగా సమురాయ్ ఆగింది. ఏమయ్యిందా అని చూస్తే పెట్రోలు అయిపోయింది.

'మైగాడ్' అంటూ తల పైకెత్తాడు రఘురాం.

రోడ్డుపైకి విశాలంగా విస్తరించిన కొన్ని చింతచెట్టుపై గుడ్లగూబ వికృతంగా చూస్తూ అరిచింది. మెల్లగా వెన్నులో చలి ప్రారంభమైంది. తనకు తెలియకుండానే శరీరంలో ప్రకంపనలు మొదలయ్యాయి.

సమురాయ్‌ని రోడ్డుపైకు నెట్టి ఏదయినా వెహికల్ వస్తుందా అని చూడసాగాడు. ... వస్తున్నాయి కాని ఆగడం లేదు.

అలాగే నిలబడి దిక్కులు చూస్తున్నాడు. దబ్బుమని శబ్దం చేస్తూ ఏదో ప్రక్కన చెట్టుపై నుండి క్రిందకు దూకింది. ఒక్క క్షణం కలవరపడి అగ్గిపుల్ల వెలిగించాడు.

అకుపచ్చగా రెండు కనులు మెరిశాయి. 'మ్యావ్' అంటూ నల్లని పిల్లి వెళ్లిపోయింది. మనసులో ఆంజనేయస్వామిని తలచుకుంటూ అటూ యిటూ తిరగడం మొదలుపెట్టాడు. ఎందుకో మదిలో తెలియని భయం.

చీకట్లో కనబడలేదు... చిన్ని కుక్కపిల్ల మీద కాలు వేశాడు. అది కుయ్యో మొర్రో అంటూ అరిచింది.

అది అరవడం రఘురాం ప్రాణం మీదకు వచ్చింది.

ఎక్కడి నుంచి వచ్చాయో నాలుగు కుక్కలు దూసుకొని వచ్చాయి. వాటి అరుపులకు సగం ప్రాణాలు పోయాయి.


భయంతో పరుగెత్తాడు. అవి వెంటబడ్డాయి. కొద్ది దూరం పరుగెత్తి ప్రక్కనే వున్న గోడను ఎక్కాడు. కాని కాలుజారి అవతలికి పడ్డాడు.

'హమ్మయ్య! పడితే పడ్డాను, ఆ కుక్కలను తప్పించుకున్నా!' అనుకున్నాడు. అవతల వైపు యింకా అవి అరుస్తూనే వున్నాయి.

ఆకాశంలో ఒక్కసారిగా పెద్దగా మెరిసింది. ఆ మెరుపు వెలుగులో కొన్ని సెకన్లపాటు స్పష్టంగా కన్పించింది చుట్టూ...

ఓరి భగవంతుడా... అది శ్మశానం... ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా వుంది పరిస్థితి. ఎక్కడ ఏ పిశాచాలు వస్తాయో. ఏ శవాలు లేస్తాయో... శరీరమంతా ఆ చలిగాలిలోనూ చెమటలు పట్టింది. దయ్యాలకు నిప్పు అంటే భయం అనే ఆలోచన రాగానే సిగరెట్ వెలిగించబోయాడు. జేబు ఖాళీగా వెక్కిరించింది. అగ్గిపెట్టె యీ పరుగులో ఎక్కడో పడిపోయింది.

చిన్నగా గజ్జెల శబ్దం. అటు చూశాడు. దూరంగా, మసకమసకగా ఏదో ఆకారం మెల్లగా వస్తోంది. రఘురాం అడుగులు ముందుకు పడటం లేదు. అది తనవైపే వస్తోంది. కొంత దగ్గరయింది. మెరుపు మెరిసింది. స్పష్టంగా ఆ ఆకారం... తెల్లని బట్టలు... ఆడ రూపం... తనవైపుకే వస్తోంది.



ఆ రూపం దాదాపు అడుగు దూరం దగ్గర్లోకి వచ్చి నిలబడింది. మరోసారి మెరుపు. ముఖంలో ముఖం పెట్టినంత దగ్గరగా కనిపించింది. నీలిరంగులో కనులు, విరబోసుకున్న నల్లని కురులు. ఆ ఆకారం చేతులు పైకెత్తింది.

ఒక్కసారిగా కొయ్యబారిపోయాడు. గొంతు తడారిపోయింది. మాట పెగల్లేదు. కాని భయంతో గావుకేక పెట్టాడు. అలాగే పడిపోయాడు!

***

కనులు తెరిచాడు రఘురాం.

పైన ఫ్యాన్ తిరుగుతోంది.

చుట్టూ చూశాడు. తను పనిచేసే ఆఫీసు మేనేజర్, తన ఫ్రెండ్ వేణు, డాక్టరు...

"రఘురాం! ఏమయ్యింది... అసలు ఏం జరిగింది?" ఆదుర్దాగా మేనేజర్ అడిగాడు.

"ప్లీజ్! బీ సైలెంట్. ఏమీ అడగవద్దు. అతడు డీప్ డిప్రెషన్‌కి లోనయ్యాడు. విశ్రాంతి అవసరం. మీరంతా బయటకు పదండి" అంటూ యిద్దరినీ బయటకు పంపి తను గదినుండి బయటకు వచ్చి నర్సుని పిలిచి-

"లోపల ఉన్న పేషంట్‌కి జ్యూస్ యిచ్చిరా!" అన్నాడు.

నర్స్ మాధురి అలాగేనని జ్యూస్ గ్లాస్‌తో ఆ గదిలోకి వచ్చింది. చిన్నగా గజ్జెల సవ్వడి... వాకిలి వైపు చూశాడు రఘురాం. అక్కడ తెల్లని డ్రస్సు, అవే నీలి కనులు, అనుమానం లేదు. అది తనను వదిలి పెట్టదు.

మెల్లగా వణుకు ప్రారంభమయింది. శరీరంలో, నరనరాల్లో ప్రకంపనలు మొదలయ్యాయి.

ఆమె... తన బెడ్ వద్దకు వచ్చి గ్లాస్ అందించబోయింది. అంతే... "డాక్టర్" అంటూ గావుకేక పెట్టి గుడ్లు తేలేశాడు రఘురాం.

నివ్వెరపోయి భయం భయంగా దూరంగా జరిగింది మాధురి.

"వాట్ హాపెన్డ్" అంటూ గాభరాగా వచ్చాడు డాక్టర్. అతడి వెనుకనే మేనేజరు, ఫ్రెండ్ వేణు... జరిగింది చెప్పింది మాధురి.

రఘురాంని పరీక్షించాడు డాక్టరు.

"నిన్న జరిగిన సంఘటన తనకు మరలా గుర్తుకు వచ్చింది కాబోలు అదే డిప్రెషన్‌కి లోనయ్యాడు. మరేం ఫరవాలేదు" అన్నాడు డాక్టరు.

***

రెండు రోజుల తర్వాత డిశ్చార్జ్ చేశారు.

డిశ్చార్జ్ అయ్యే సమయంలో తన క్లోజ్ ఫ్రెండ్ శంకర్ హడావిడిగా వచ్చాడు. వచ్చీ రావడంతోనే "ఒరేయ్ రఘు! పదరా, నీకోసమే వెయిటింగ్" అన్నాడు.

"ఎక్కడికిరా యింత ఆత్రం?" అడిగాడు రఘురాం.

"అబ్బా! అవన్నీ తర్వాత చెబుతాను. పద. బస్ టైం అవుతోంది" అంటూ తొందరపెట్టాడు.

బస్‌లో కూర్చున్నాక తీరిగ్గా చెప్పడం మొదలెట్టాడు శంకర్... "ఒరేయ్! యీరోజు పెళ్లిచూపులకు ఒంటరిగా వెళుతున్నా! నీవు లేకుండా ఎక్కడికయినా వెళ్ళానా? అందుకే నీ హెల్త్ సరిగా లేకున్నా యిలా పట్టుకు వచ్చాను. ఏమీ అనుకోకు"

"భలేవాడివి! కాని యింత అర్జంటుగా పెళ్లి చూపులేమిట్రా?" అడిగాడు రఘురాం.

"ఆ, నేను చూడబోయే అమ్మాయిని అమ్మా, నాన్న చూశారు. ఆ అమ్మాయి అమ్మమ్మగారు పైకి పోవడానికి సిద్ధంగా వుందట. పోయేలోగా ఆమె పెళ్లి చూడాలట. అందుకే" చెప్పాడు శంకర్.

***

"రండిబాబు" ఆహ్వానించాడు వెంకటేశ్వర్లు.

శంకర్, రఘురాంలు వచ్చి కూర్చున్నారు. పరిచయా

టి. సురేష్ బాబు

లయ్యాయి.

"ఏమేవ్! అమ్మాయిని తీసుకురా" అరిచాడు వెంకటేశ్వర్లు.

అప్రయత్నంగా యిద్దరి చూపులు లోపలి గదివైపు తిరిగాయి. లోపలినుంచి ఘల్లు ఘల్లున గజ్జెల సవ్వడి. ఎందుకో రఘురాం గుండెలో అలజడి మొదలయింది. శరీరం చెమరించడం, వణకడం మొదలయ్యింది.

అందంగా ముస్తాబయిన అమ్మాయి యువతలికి వచ్చింది లోపలి గదిలోంచి. లేత నీలి రంగు చీరలో అప్సరసలా వుంది. కాఫీ ట్రేతో వస్తోంది.

"మా అమ్మాయి మాధురి" చెప్పాడు వెంకటేశ్వర్లు.

ఆమెను చూస్తోంటే ఏదో గుర్తుకు వస్తోంది రఘురాంకి. అవే నీలికనులు, నల్లని కురులు. అదే రూపం.

కాఫీ గ్లాసు అందించింది మాధురి. ఆమె ముఖం వైపు చూశాడు భయంగా రఘురాం. ఆమె కూడా అప్రయత్నంగా చూసింది. రఘురాంని గుర్తించింది. కనులు భయంగా వెడల్పు అయ్యాయి మాధురికి.

అప్పటికే కాళ్లు చేతులు గిలగిల కొట్టుకుంటూ ఊగిపోతూ అమ్మా అంటూ పడిపోయాడు రఘురాం.

★★★

"ఒరేయ్ రఘూ! ఏమీ ఆలోచించకు. నిన్ను దయ్యం వెంబడిస్తోందని భ్రమ పడుతున్నావు అంతే. స్థలం మార్పిడి అవసరం అని యిలా నిన్ను మా పల్లెటూరికి తీసుకువచ్చాను. యీ గదిలో నీవు హాయిగా రెస్ట్ తీసుకో!" అన్నాడు వేణు.

"సరేరా! అన్నాడు రఘురాం!

వేణు మేడపై నుండి క్రిందకు వెళ్లాడు.

రఘురాం గదినుండి బయటకు వచ్చాడు. పెద్ద యిల్లు పైన రెండు గదులు. మిగిలినదంతా ఖాళీ. కొద్ది సేపు తర్వాత లోపలికి వచ్చి బుక్ అందుకొని బెడ్‌పై పడుకొని చదువుతూ అలాగే నిద్రలోకి జారుకున్నాడు.

సరిగ్గా అదే సమయంలో ఆ మేడకు రెండిళ్లవతల ఓ గుడిసెలో...

బియ్యపు పిండితో ముగ్గువేసి ఒక పుర్రెను ఆ ముగ్గు మధ్యలో వుంచి చుట్టూ నిమ్మకాయలు కోసి పసుపు కుంకుమ చల్లి దాని ముందు మాధురిని కూర్చుండబెట్టాడు శరభయ్య. ఆ గ్రామంలో పేరుపొందిన భూత మాంత్రికుడు. ఒక ప్రక్కగా మాధురి తండ్రి వెంకటేశ్వర్లు.

గుగ్గిలాన్ని నిప్పుల్లో వేశాడు శరభయ్య. గుడినంతా పొగ ఆక్రమించింది. ఆ పొగకు మాధురికి తల తిరిగినట్లయింది. అసలే తనకు దయ్యం పట్టిందని వీడు చెబితే కోపంగా వుంది. పైగా యీ పొగ ఒకటి.

"రావే! శాకినీ... ఢాకినీ... ఎవరవే నీవు... ఏం కావాలి నీకు" అంటూ చేతిలో ఎముక పట్టుకొని ఏదో మంత్రం చదివాడు శరభయ్య.

మాధురి మాట్లాడలేదు. "ఏమే... మాట్లాడవు?" అంటూ మాధురి జుట్టును పట్టుకొన్నాడు శరభయ్య.

ఒక్కసారి శరభయ్య చెంప ఛెళ్లుమనిపించింది మాధురి.

చుక్కలు కన్పించాయి శరభయ్యకు.

ఏం చెయ్యాలో తోచలేదు. వెంకటేశ్వర్లు బిత్తరపోయాడు.

"నన్నే కొడతావా? నిన్ను యిప్పుడే భూస్థాపితం చేస్తా" అంటూ పిడికెడు సాంబ్రాణి ఆమె ముందున్న నిప్పుల్లో చల్లాడు. ఆ పొగకు ఊపిరి ఆడక మాధురి అలాగే ప్రక్కకు వాలిపోయింది.

శరభయ్య వెంకటేశ్వర్లు వైపు చూస్తూ, "మీరు వెళ్లి బయట పడుకోండి. నేను మీ అమ్మాయికి పట్టిన దయ్యాన్ని వదిలించే వరకు నిద్రించను. అది మరలా వచ్చేవరకు యిక్కడే యిలాగే వుంటాను" అంటూ మాధురి ఎదురుగా కూర్చున్నాడు శరభయ్య. వెంకటేశ్వర్లు బయటకు వెళ్లాడు.

కొద్దిసేపటికి, మాధురి నెమ్మదిగా లేచింది. మెల్లగా అడుగులు వేస్తూ బయటకు దారితీసింది. ఆమెను అనుసరించాడు శరభయ్య.

"ఓరినాయనో! యిది నిజంగా దయ్యమేనేమో... భగవంతుడా! ఏదో ప్రజలని నమ్మించి యిలా బ్రతుకుతున్నా! ఎక్కడికి వెళుతుందో ఏం చేస్తుందో. ఏమో చూద్దాం" అనుకుంటూ గుండెలు బిక్కుబిక్కుమంటుంటే తన మంత్రదండం పట్టుకొని ముందుకు కదిలాడు శరభయ్య.

మాధురి వీధిలోకి వచ్చింది. మెల్లగా రఘురాం వున్న యింటివైపు దారి తీసింది. ఆ ఇంటిని చేరి మెట్లెక్కసాగింది.

ఉన్నట్టుండి రఘురాంకి మెలకువ వచ్చింది. లేచాడు. సమయం 12 గంటలు. టీవీ ఆన్ చేశాడు. 'నిను వీడని నీడను నేనే' సాంగ్ వస్తోంది. గుండె భయంతో బరువెక్కింది. వెంటనే ఆఫ్ చేశాడు. ఇటు తిరిగాడు. అక్కడ నిలువెత్తు అద్దం. తనను చూసుకున్నాడు. అంతలో సన్నగా గజ్జెల సవ్వడి చెవులను సోకింది. మరలా నరనరాల్లో ప్రకంపనలు మొదలయ్యాయి.

అద్దంలోకి చూస్తూ వుండగా గుండెలు బ్రద్దలయ్యాయి. అద్దంలో తన గది వాకిట్లో ఆ రూపం నిలబడి వుంది. ఇటు తిరిగాడు రఘురాం. అదే రూపం. అవే నీలి కనులు. అవే కురులు. అదే తెల్లని డ్రస్సు.

రఘురాం దగ్గరగా వచ్చింది మాధురి. రఘురాంకి గొంతులో తడి ఆరింది. భయంతో గావుకేక పెట్టి పడిపోయాడు.

ఆ కేకకి యీ లోకంలోకి వచ్చింది మాధురి.

తను ఎక్కడుంది అర్థం కాలేదు. ఎదురుగా రఘురాం పడిపోయి కన్పించాడు. అంతలో వాకిట్లోంచి "ఏయ్! శాకినీ... ఢాకినీ... ఏం చేశావే..." అంటూ లోపలికి వచ్చాడు శరభయ్య.

అతడిని చూడగానే కోపంతో, తనను ఏం చేస్తాడో అన్న భయంతో మాధురి ప్రక్కనే టేబుల్‌పై పండ్లు కోయడానికి పెట్టిన కత్తిని అందుకొని "ఒరేయ్! రారా! దగ్గరకు వస్తే నీ పని ఖతం" అంటూ ముందుకు వచ్చింది.

అనుకోని ఈ సంఘటనకు నివ్వెరపోయిన శరభయ్యకు ఏం చెయ్యాలో పాలుపోలేదు.

"ఒసేవ్! నన్ను వదిలేయ్. నీకు దణ్ణం పెడతా! నా బ్రతుకేదో నే బ్రతుకుతా! నీ జోలికి రాను" అంటూ ప్రాధేయపడ్డాడు శరభయ్య.

"ఈరోజు నిన్ను వదలను. నన్ను దయ్యం అంటూ ఏమేమో చేస్తావా?" అంటూ మీదికి వచ్చింది మాధురి.

"చచ్చానురో... యిది నన్ను వదలదు" అంటూ గావుకేక పెట్టి క్రిందపడిపోయాడు శరభయ్య. అతడి మీదకు రాబోయిన మాధురి తూలి క్రిందపడి మంచం తగిలి పడిపోయింది.

శరభయ్య అరుపులకు క్రిందనుండి వేణు పరిగెత్తుకుని వచ్చాడు. అంతలో రఘురాంకి మెలకువ వచ్చింది. చుట్టూ చూశాడు.

తన గదిలో మాధురి, శరభయ్య పడిపోయి వుండటం కన్పించింది.

"ఏం జరిగిందిరా?" అడిగాడు వేణు వచ్చి.

"అదీ దయ్యం" అంటూ మాధురి వైపు చేయి చూపించాడు రఘురాం.

అంతలో వెంకటేశ్వర్లు క్రిందనుండి పరిగెత్తుకుని వచ్చి "అమ్మా! మాధురి ఏమయ్యిందే" అంటూ నీళ్లు ముఖంపై చల్లాడు. మాధురికి మెలకువ వచ్చింది.

"మీరు" అంటూ ఆగిపోయాడు రఘురాం వెంకటేశ్వర్లుని చూస్తూ.

వెంకటేశ్వర్లు రఘురాంని చూసి "నీవు యిక్కడా" అన్నాడు.

"మీ అమ్మాయి... యిక్కడ... నేను దయ్యంగా భావించాను. ఎందుకంటే నేను శ్మశానంలో చూసిన దయ్యం యిలాగే వుంది" అన్నాడు రఘురాం.

"అయ్యో! మా అమ్మాయి మాధురికి నిద్రలో నడిచి వెళ్లే అలవాటుంది. ఏదో గ్రహపీడ అనుకొని బాగుపరచాలని యిలా ఈ ఊరికి వచ్చి పూజలు చేయిస్తున్నా. ఈ మంత్రగాడు ఏమయ్యాడో" అన్నాడు వెంకటేశ్వర్లు.

"ఇప్పటికి ఏం కాలేదు. ఏదో నా రాత బాగుండి, నే బ్రతికాను" అంటూ లేచి వెళ్లిపోయాడు శరభయ్య పరుగులాంటి నడకతో.

"అదీ యిప్పుడు అర్థమయింది" అన్నాడు వేణు.

ఏమిటీ అన్నట్లు ముఖం పెట్టారు అందరూ.

"మావాడు అనుకోకుండా శ్మశానంలో అడుగుపెట్టిన రోజు మీ మాధురి నిద్రలో అక్కడికి వెళ్లి వుంటుంది. ఆమెను చూసిన భయం అలాగే నిలిచి పోయివుంటుంది. వీడికి, తిరిగి మాధురిని హాస్పిటల్‌లో, పెళ్లిచూపుల్లో మరలా యిక్కడా చూసేసరికి తనను వెంబడిస్తోందన్న డిప్రెషన్‌కి లోనయి, యీ విధంగా జరిగింది. చూశావా రఘు, నీది భ్రమ అని చెప్పలేదూ... నీ సందేహం తీరిందా... ఆ... ఏమండీ ఏదయినా ట్రీట్‌మెంట్ తీసుకుంటే యిలా నిద్రలో నడిచే అలవాటు పోతుందిగాని యిలా మంత్రాలతో పోతుందా" అన్నాడు వేణు.

"మాధురిగారు నన్ను క్షమించండి. మిమ్మల్ని మరోలా భావించి.." అన్నాడు రఘురాం.

"దానికేమిలెండి! యిందులో నా పాత్రా వుందిగా. మిమ్మల్ని మానసికంగా బాధపెట్టినందుకు బాధపడుతున్నాను" అంది మాధురి.

"యిక ఎవరికీ యిబ్బంది లేదులెండి. అందరి సందేహాలు తీరాయి" అన్నాడు వేణు ప్రశాంతంగా. ★